క్లుప్తంగా

శృంగార వల్లభుడి సన్నిధిలో కలెక్టర్



శృంగార వల్లభ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్

పెద్దాపురం: స్వయంభూ తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి సన్నిధిలో బుధవారం జిల్లా కలెక్టర్ షన్మోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నారాయణాచార్యులు, పురుషోత్తమచార్యులు కలెక్టర్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. పురాతన చరిత్ర కల్గిన ఆలయ విశిష్టతపై మరింత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం స్వామివారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, కొత్తెం కోటి, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, తదితరులున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సునీత

సామర్లకోట: మున్సిపాలిటీకి మంజూరైన 15వ ఆర్థిక సంఘ నిధులు 28, 29 వార్డుల కూడలి రోడ్డుకు కేటాయించడంతో ఆ రోడ్డు నిర్మాణానికి 28వ వార్డు కౌన్సిలర్ రెడ్నం సునీత బుధవారం శంకుస్థాపన చేశారు. ఆర్థిక సంఘ నిధుల్లో రూ.4.60లక్షలు రోడ్డు నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం పొందడంతో గత కొంత కాలంలో పనులు ప్రారంభ కాలేదన్నారు. ఇంజినీరింగ్ శాఖ అధికారుల సూచనలతో కాంట్రాక్టరు పనులు చేయడానికి ముందుకు రావడంతో శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో 28, 29 వార్డుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్నం దొరబాబు, ఇంజినీరింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్!



పుస్తకాలను పరిశీలించిన ఎంఈఓ పుల్లయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలు బుధవారం స్టాక్ పాయింట్‌కు చేరుకున్నాయి. ఈ పుస్తకాలను మండల విద్యాశాఖాధికారి–2 పి.పుల్లయ్య పరిశీలించారు. మండలానికి వచ్చిన పుస్తకాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో భద్రపర్చారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ సుబ్రహ్మణ్యం, సీఓ ప్రశాంతి, సీఆర్పీలు ఉమ, శ్రీను, నాగమణి పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత గ్రామోత్సవం



గొల్లప్రోలులో అమ్మవారిని ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు

పిఠాపురం: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి పురస్కరించుకొని బుధవారం పిఠాపురం, గొల్లప్రోలులో అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిఠాపురంలో అమ్మవారికి కాకినాడ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పీవీ కుమార్, కార్యవర్గం సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు వెలగా వెంకట నగేష్, జోన్ చైర్మన్ నాగేంద్ర కుమార్, బోడ సతీష్, పిఠాపురం మండల అధ్యక్షుడు రేపాక రమేష్, సెక్రటరీ కె. శ్రీరామ్, కోశాధికారి కంచర్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు. గొల్లప్రోలులో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కేదారిశెట్టి నానాజీ, కుసుమంచి పాపారావు, గొల్లపూడి చలమయ్య, ఉర శ్రీను, కేదారిశెట్టి చలపతి, దంగేటి సత్తిబాబు పాల్గొన్నారు.

బాలికల భవితకు బాటలు

- గ్రామాల్లో కిశోర వికాస శిబిరాలు
- ఆరోగ్య పరిరక్షణ, సామాజిక అంశాలు, చట్టాలపై అవగాహన
- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా రూపకల్పన



పెద్దాపురంలో కిశోర వికాసం ద్వారా బాలికలకు అవగాహన కల్పిస్తున్న బృందం



కిశోర బాలికల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సూపర్‌వైజర్

పెద్దాపురం: కౌమర దశలో బాలికల అనారోగ్య సమస్యలు, ఇతర ఒడిదొడుకులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కిశోర వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. బాలికల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇతర శాఖలను సమన్వయం చేసుకుని సామాజిక అంశాలతోపాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు. మే 2వ తేదీన ప్రారంభం కాగా జూన్ 10వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయి. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట పట్టణాలతో పాటు రెండు మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డీఆర్‌డీపీ, వీఆర్‌ఓ, ఎంపీహెచ్‌డబ్ల్యూఓ తదితరులతో కూడిన బృందాలతో గ్రామాల్లో కిశోర బాలికలకు ఆహారం, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మ రక్షణ, బాల్య వివాహాలకు దూరంగా ఉండడం తదితర విషయాలను వివరిస్తున్నారు.

గ్రామ స్థాయిలో కమిటీ

కిశోర వికాసం కోసం గ్రామ, వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్త, బహుళార్థ సాధక ఆరోగ్య కార్యకర్త, గుర్తింపు పొందిన కార్యకర్త, సచివాలయ అర్గనైజింగ్ అసిస్టెంట్లు ముఖ్యపాత్ర పోషిస్తారు. ఈ కమిటీ కౌమర బాలిక వివరాలను సేకరించి, బృందాలుగా ఏర్పాటు చేసి వారితో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏర్పాట్లలో మహిళా సంరక్షణ కార్యదర్శి కీలకంగా వ్యవహరిస్తున్నారు. మిగిలిన నలుగురు సభ్యులు కార్యక్రమానికి సహకరిస్తారు. మహిళా సంరక్షణా కార్యదర్శి లేని చోట అంగన్‌వాడీ కార్యకర్తలే పర్యవేక్షిస్తారు. పంచాయతీ కార్యదర్శి, స్థానిక పాఠశాల హెచ్‌ఎం, ఏఎన్‌ఎంలు అవసరమైతే సహకరిస్తారు.

కౌమర బాలికల గ్రూపులు

14 నుంచి 18 ఏళ్లలోపు ఉన్న బాలికలు, బడి మానేసిన 11 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి వారిని గ్రూపులుగా విభజిస్తారు. వారికి ఎంపిన చేసిన అంశాలపై ఆయా ప్రాంతాల్లో బాలికలకు అనువైన సమయంలో గంట పాటు శిక్షణ ఇస్తారు. ఇటవల బాలికలే లక్ష్యంగా మోసాలు పెరిగాయి. ప్రధానంగా ప్రేమ పేరుతో కొందరు వారి వంచనకు గురి చేస్తున్నారు. మరికొందరు రాజీ పేరుతో బాల్య వివాహాలు జరుపుతున్నారు. బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించి వారు ఆయా అంశాల్లో సమర్థవంతంగా ఉండేలా శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) అధికారులు కృషి చేస్తున్నారు.

ఆత్మస్థైర్యం పెంపొందిస్తాం..



కిశోర వికాసం ద్వారా బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా ప్రణాళిక రూపొందించాం. వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు ఉపయోగపడేలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సామాజిక అంశాలపై చైతన్యవంతులను చేస్తున్నాం. తద్వారా సమాజంలో మార్పుకు శ్రీకారం చుడుతున్నాం.

– చంద్రకళ, ఐసీడీఎస్ సూపర్ వైజర్, దివిలి సెక్టార్, పెద్దాపురం మండలం

పూర్తి స్థాయిలో అవగాహన



బాలికలకు ఎదురయ్యే సమస్యలపై కిశోర వికాసం ద్వారా పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం సమాజంలో బాలికలే లక్ష్యంగా మోసాలు పెరుగుతున్నాయి. నిర్ణీత ప్రనాళికతో వారికి అవగాహన కల్పించి అన్ని అంశాల్లో వారు సమర్థవంతంగా ఉండేలా కృషి చేస్తున్నాం.

–జి.ఉష, సీడీపీఓ, పెద్దాపురం

ఈటీసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రమణ



ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను అభినందించిన ఫ్యాకల్టీలు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జి.రమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న జె.వేణుగోపాల్ దీర్ఘకాలిక సెలవులో ఉండడంతో ఆయన స్థానంలో సీనియర్ ఫ్యాకల్టీని జి.రమణను నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు రమణను పలువురు అభినందించారు.

పాత చలానాలు కట్టించిన ట్రాఫిక్ ఎస్సై

సామర్లకోట: గత ఆరు నెలలుగా వివిధ కేసులకు సంబంధించిన వాహనచోదకుల నుంచి పాత అపరాధ రుసం రూ.21,490 చలానాగా బుధవారం కట్టించారు. బుధవారం సాయంత్రం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్సై గరగారావు వాహనదారులు ఆయా వాహనాలకు అపరాధ రుసం చెల్లించాల్సి ఉన్నట్టు గుర్తించారు. దీంతో వారితో మాట్లాడి చలానాలు కట్టించారు. వాహనాల యజమానులు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించేటప్పుడు ఆ వాహనాలకు ఫొటో తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆ విధంగా ఫొటో తీసిన వాహన యజమాని సెల్‌ఫోన్‌కు అపరాధ రుసం మెసేజ్ వస్తుంది. వాటిని వెంటనే చెల్లించాలి. అయితే కొంత మంది నిర్లక్ష్యం చేస్తున్నారు. తనిఖీల్లో అలాంటి వారితో మాట్లాడి ట్రాఫిక్ ఎస్సై వారితో చలానా కట్టించారు.

ఉన్నత లక్ష్యంతో విద్యను కొనసాగించాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గంగాధరుడు

పెద్దాపురం: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో తమ విద్యను కొనసాగించాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక వరహాలయ్య పేట యాసలపు సూర్యారావు భవనంలో అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఉత్సాహపూరిత వాతావరణంలో చేపట్టిన సమ్మర్ క్యాంపును ప్రముఖ దంత వైద్యులు జమ్మి శిరీష, చేనేత సొసైటీ అధ్యక్షుడు ముప్పన వీర్రాజు, యూటీఎఫ్ నాయకులు రవి వర్మ, ప్రభాకర వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో వారు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి స్ఫూర్తితో సమ్మర్ క్యాంప్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. పిన్న వయస్సు నుంచి అల్లూరి ఎన్నో విద్యలు నేర్చుకున్నారన్నారు. చిన్నారులంతా అన్ని విద్యలపై దృష్టి సారించి సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. నక్షత్ర దంత ఆసుపత్రి వైద్యులు జమ్మి శిరీష, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్ పెదిరెడ్డి, యూటిఎఫ్ నాయకులు అనంతరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అన్ని విద్యలు నేర్చుకునేందుకు పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సమ్మర్ క్యాంప్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అనంతరం సమ్మర్ క్యాంప్ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో క్యాంప్ అధ్యక్ష, కార్యదర్శిలు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, రాజేష్ కుమార్ దేవతా, మూర్తి, డి.కష్ణ, అమృత, నమ్రత, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమ్మె ప్రారంభం



సామర్లకోటలో కాటన్ విగ్రహానికి నివాళులర్పించిన కాంట్రాక్టు ఇంజనీరింగ్ కార్మికులు

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు బుధవారం సమ్మె ప్రారంభించారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు అర్పించి సమ్మె ప్రారంభించారు. సమ్మె మొదటి రోజు కావడంతో నల్ల బాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్సు యూనియన్ అధ్యక్షుడు వుండవిల్లి రామరాజు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితం కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేసినట్టు తెలిపారు. ఆరు నెల క్రితం సీడీఎంఎ చర్చ పేరుతో తమ సమస్యలు పరిష్కరించడానికి మూడు నెలల సమయం కొరడం జరిగిందని, అయితే ఆరు నెలలు గడిచినా సమస్యలు పరిష్కారం కాక పోవడంతో విధి లేని పరిస్థితిలో సమ్మె చేయవలసి వచ్చిందన్నారు. 15 సంవత్సరాల సీనియార్టీ ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధులలో చని పొయిన వారికి రూ.10 లక్షలు నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్, నాన్ స్కిల్ వర్కర్లను గుర్తించి వేతనాలు ఇవ్వాలనే డిమాండ్‌లు ప్రభుత్వం వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్ర మంలో యూనియన్ నాయకులు పులపకూర రామకృష్ణ, లంక శ్రీహరి, నక్క రత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి కుట్టు శిక్షణ దోహదం



పనసపాడులో కుట్టు శిక్షణను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

సామర్లకోట: మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించడానికి కుట్టు శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబులు అన్నారు. బుధవారం మండల పరిధిలో పనసపాడు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణను వారు ప్రారంభించారు. నియోజవర్గ పరిధిలో ఏడు కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ శిక్షణా కేంద్రంలోను 150 మందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి కుట్టు శిక్షణ కేంద్రంలోను 25 కుట్టుమెషన్లు ఉన్నాయని, వాటిపై ప్రతిరోజు ఆరు బ్యాచ్‌లలో శిక్షణ ఉంటుందన్నారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు కుట్టుమెషీన్ ఉచితంగా అందజేస్తామన్నారు. కుట్టు శిక్షణపై ఆసక్తి కలిగిన మహిళలందరికీ శిక్షణ ఇస్తామని ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్, కుట్టు శిక్షణ డైరెక్టరు పెంకే వెంకటేష్, గ్రామ నాయకులు లక్ష్మణ్, రాఘవ, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ అభ్యాస్ మాక్‌డ్రిల్

- యుద్ధ సమయంలో అప్రమత్తంగా ఉండాలి
- అధికారుల సూచనలు



సామర్లకోటలో మాక్ డ్రిల్ చేసి చూపిస్తున్న ట్రాఫిక్ ఎస్సై, మున్సిపల్ సిబ్బంది



యుద్ధ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న మున్సిపల్ కమిషనర్

సామర్లకోట: పాకిస్థాన్‌పై మన దేశం యుద్ధానికి సిద్ధం కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివిధ శాఖల అధికారులు సూచించారు. యుద్ధ ప్రభావం కారణంగా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తపై బుధవారం సాయంత్రం స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో నిర్వహించిన ఆపరేషన్ అభ్యాస్ మాక్ డ్రిల్ ఎంతగానో ఆకట్టుకుంది. యుద్ధం జరిగే సమయంలో దగ్గరలో ఉండే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు వివరించారు. యుద్ధానికి సంబంధించిన బాంబు శబ్దాలకు ధైర్యంగా ఉండాలన్నారు. భయంతోనే కోవిడ్ సమయంలో అనేక మంది చనిపోయారని అధికారులు గుర్తు చేశారు. పాకిస్థాన్‌ను సురక్షితంగా ఎదుర్కొనడానికి సైన్యం పని చేస్తోందని వారికి మద్దతు ఇచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రదేశాలలో తల దాసుకోవాలని సూచించారు. కొన్ని సమయాల్లో గోతులు తీసుకొని వాటిలో ఉండవలసి వస్తుందన్నారు. బాంబులు వేస్తున్న సమయంలో ఏవిధంగా తప్పించుకోవాలో స్థానికులకు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు మాక్ డ్రిల్ చేసి చూపించారు. ఈ సందర్భంగా స్టేషన్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. దేశ ప్రజలు అందరూ ఐక్యంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్, రెవెన్యూ, ఎంపీడీఓ, సచివాలయ, పోలీసు సిబ్బంది, ఆయా షాపుల యజమానులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు

యువతకు ఆదర్శం అల్లూరి పోరాటం



ఆనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రైతుకూలీలు

పెద్దాపురం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అడుగు జాడల్లో పయనించేందుకు యువత సిద్ధం కావాలని పలువురు వక్తలు అన్నారు. అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వరహాలయ్యపేటలోని అల్లూరి విగ్రహానికి, పాత బస్టాండ్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ నేటి యువత సామాజిక అవగాహన పెంచుకుని అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అల్లూరి విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డి.క్రాంతికుమార్, సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, డీవైఎఫ్ఐ నాయకులు సత్తిబాబు, దారపురెడ్డి కష్ణ, మహాపాతిన రాంబాబు, డి.సత్యవతి, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో..

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుధవారం పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఏపీ రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో ఆనూరు గ్రామంలో సీతారామరాజు వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, కుంచే అంజిబాబు మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో పోరాటాల దిశగా పయనిద్దామని ఆయన పిలుపునిచ్చారు. భారత జాతి విముక్తి కోసం ఆయన చిన్నతనంలోనే సాయుధ పోరాటాలు సాధించిన ఘనత అల్లూరిదన్నారు. తొలుత గ్రామంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి రాజుబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వల్లూరి రాజుబాబు, పీడీఎస్‌యూ నాయకులు కడితి సతీష్, కర్నాకుల రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష, పైడిమళ్ళ నాగరాజు, పైడిమళ్ళ సూరిబాబు, గానుగుల అప్పారావు, కొల్లు ఏసియ్య, పైడిమల్ల వీర్రాజు, అచ్చయ్య రైతుకూలీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అవగాహన



పిఠాపురంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు



గొల్లప్రోలులో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

పిఠాపురం: పాకిస్థాన్ ఇండియా మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు బుధవారం పిఠాపురం, గొల్లప్రోలులో అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. గొల్లప్రోలులో డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, ఆర్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది మాక్ డ్రిల్‌లో పాల్గొని స్థానికులకు విపత్కర పరిస్థితుల్లో ఎటువంటి జాగ్రత్తలు పాటించాలనే దానిపై అవగాహన కల్పించారు. పిఠాపురంలో మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహసీల్దారు పీవీవీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

కుండపోత వర్షం

పెద్దాపురంలో వీధులు జలమయం



జలమయమైన రాజుగారి వీధి

పెద్దాపురం: మండలంలో బుధవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. వర్షానికి పెద్దాపురం పట్టణ, గ్రామాల్లోని వీధులు జలమయయ్యాయి. ఈదురు గాలులకు భారీ వృక్షాలు నేల కూలాయి. ఏకదాటిగా కురిసిన వర్షానికి పట్టణంలో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రోడ్లన్నీ వర్షపు నీటితో పొంగిపొర్లాయి. మున్సిపల్ సెంటర్, కబడ్డి వీధి, నాయీబ్రాహ్మణ కాలనీ, గోలి వారి వీధి, శివాలయం వీధి, మెయిన్‌రోడ్డుతో పాటు పలు మురికి వాడల్లో ప్రజలు ఆ మురుగు నీటి సంచరిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. పట్టణంలో పలు చోట్ల వర్షం వస్తే వీధులు జలమయమై తాము ఇబ్బందులు పడుతున్నామని అధికారులు తాము ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడు లేదులే లేరని నాయీ బ్రాహ్మణ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పురపాలక యంత్రాంగం స్పందించి ఆయా మురికి వాడల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏడాదిలో స్కీముల్లేవు అన్నీ స్కాములే



జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా స్కీములు పక్కన పెడితే స్కామ్‌ల బాట పట్టిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. స్కీములు ముసుగులో స్కాములు చేస్తూ నాయకులు తమ జేబులు నింపుకొంటున్నారని జగన్ పాలనలో ప్రతి ఒప్పందంలోను పారదర్శకత కనిపిస్తే నేడు చంద్రబాబు ప్రభుత్వంలో పారదర్శకత లోపించి దోపిడీ, మోసం కనిపిస్తున్నాయని అన్నారు. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, లిక్కర్ మాఫియా, రాజధాని నిర్మాణాల్లో అంచనాలు ఊహించనంత విధంగా పెంచి ప్రజాధనాన్ని దోచుకోవడం చూస్తున్నారని తెలిపారు. తాజాగా లంచాలు తీసుకుంటూ అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకొని ప్రజలకు చంద్రబాబు షాక్ ఇచ్చారన్నారు. గృహ, వ్యవసాయం విద్యుత్ సరఫరాను తగ్గించి చార్జీలు పెంచి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచం ఇంకా తగ్గిస్తాం, గత జగన్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నాశనం చేసింది ఐదేళ్లలో 1.29 లక్షల కోట్లకు పైగా నష్టం జరిగింది అంటూ ఎన్నికల ముందు ఆ తర్వాత శ్వేత పత్రంలో విమర్శలు చేసిన సీఎం చంద్రబాబు ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు.

లంచాల కోసం అవినీతి కోసం బరితెగించి భారీ ధరకు కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం ద్వారా చరిత్రలోనే అతిపెద్ద స్కాంకు చంద్రబాబు ప్రభుత్వం పాల్పడుతుందని ఆమె విమర్శించారు. మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా మహిళలు ఇప్పటికే గ్రహించారని పేర్కొన్నారు.